ఆదర్శంగా సంక్షేమం

- రూ.1.46 కోట్ల పనులకు భూమిపూజ
- ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం

అలంపూర్ రూరల్: సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. మండలంలోని లింగస్‌వాయి, క్యాతూర్, కోనేరు గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేసి రూ.1.46 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. లింగస్‌వాయిలో రూ.25 లక్షలతో మాల కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మరో రూ.5 లక్షలతో ముస్లిం గ్రేవియార్డ్ ప్రహరీ నిర్మాణం, కోనేరులో రూ.5లక్షల సీసీ రోడ్ల నిర్మాణం, మరియు రూ.5లక్షలతో బోయ వాల్మీకి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం, క్యాతూర్‌లో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులు, రూ.5 లక్షలతో మహిళా సమైఖ్య భవన నిర్మాణం, రూ.86 లక్షలతో జిల్లా పరిషత్ హైస్కూల్ భవన నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ప్రతి గడపకు సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇస్మాయిల్, గోకారి, అల్లబకాష్, నర్సన్‌గౌడ్, ఫయాజ్ ఉన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి..

అలంపూర్: పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ముస్లిం మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పేద ముస్లిం మహిళలను ఆదుకోవడానికి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఉచితంగా కుట్టుమిషన్లు అందించడం జరుగుతుందన్నారు. ఓవర్‌సీస్ పథకం ద్వారా ముస్లిం వర్గాలకు చెందిన యువత విదేశాల్లో విద్యను అభ్యసించడానికి ఉపకార వేతనాలను మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అలంపూర్ చౌరస్తాలో కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం

లబ్ధిదారులకు పట్టాల పంపిణీ..

అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో అలంపూర్ మండలం భైరన్‌పల్లికి చెందిన 32 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు శంషాద్ ఇస్మాయిల్, కాశపోగు రాజు, ఎంపీపీ బేగం, గ్రామ సర్పంచ్ అయ్యన్న ఉన్నారు.

క్లుప్తంగా

నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాలకృష్ణ

అయిజ: రెండు సంవత్సరాలుగా అయిజ మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేసిన గోల్కొండ నర్సయ్య బదిలీ అయ్యారు. యాదగిరిగుట్టలో పనిచేస్తున్న బాలకృష్ణ అయిజ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన జీఓ సోమవారం విడుదలైనట్లు సిబ్బంది తెలిపారు.

పునరావాస లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువన ముంపునకు గురైన పునరావాస లబ్ధిదారులకు ప్లాట్ల ప్రొసీడింగ్స్‌ను సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేవులపల్లి సర్పంచ్ శివారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగేష్, సర్వారెడ్డి, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



అలంపూర్: అలంపూర్ మున్సిపాలిటీలోని 10వ వార్డులో దసరా కానుకగా బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్య శెట్టి, 10 వార్డు కౌన్సిలర్ సుదర్శన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ జయరాముడు, నాయకులు కృష్ణ, నజీర్ ఉన్నారు.

కురువసంఘం నాయకుల సమావేశం



అయిజ: మండలంలోని ఉప్పలలో సోమవారం మాదాసి కురువ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడారు. రాబోయే ఎన్నికల కురవ సామాజిక వర్గం ప్రాధాన్యత చాలా ఉంటుందని, కురువ సామాజిక వర్గం డిమాండ్లను నెరవేర్చుకునేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు లక్ష్మన్న, మహేశ్వరమ్మ, రాజేష్, వీరేష్, భీమరాయుడు, బడేసాబ్, రమేష్, ఉలిగయ్య, శ్రీను, చిన్న వీరయ్య , వెంకట్రాముడు, పల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



ధరూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని గ్రామ సర్పంచు పద్మమ్మ, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. క్యాక్రమంలో మాజీ సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ సురేష్, ఎంపీటీసీ దౌలన్న, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఎస్‌ఎంసీ చేర్మన్ నర్సింహులు, పీఈటీ శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.

గోడ రాతలు, పోస్టర్లు తొలగించండి

మానవపాడు: ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేట్ కార్యాలయాల్లో, స్థలాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన పోస్టర్లను తొలగించాలని ఎంపీడీఓ రమణరావు ఆదేశించారు. సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని, గ్రామాల్లో వాల్‌పోస్టర్లు, రాజకీయ నాయకుల చిత్రపటాలను తొలగించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జుబెర్ మొహినొద్దీన్, ఎంపీఓ ఆంజనేయరెడ్డి, అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన దివ్యాంగులు

అమరచింత: నెలకు రూ.పది వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు మండల దివ్యాంగులు తరలివెళ్లారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించాలని, 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం ప్రతి ఒక్క దివ్యాంగుడు ప్రభుత్వాలతో పోరాడాలని పిలుపునిచ్చారు. రామాంజనేయులు, ప్రభుదాస్, కళానందం, గోపాల్ పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: చదువుతోనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా చదివించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చాగదోనలో నూతన పాఠశాల భవనాలను, డిజిటల్ తరగతి గదులను ఎమ్మెల్యే బండ్ల ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ సుమతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అంగడి బస్వరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేస్తే సహించలేరు..

గద్వాల రూరల్: గత ప్రభుత్వాలు చేయని విధంగా గద్వాలలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తే చూసి సహించలేని కుసంస్కార నేతలు బీజేపీ నాయకులని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ మెడికల్ కాలేజీ మంజూరీకి సంబంధించి ప్రభుత్వం జీవోను విడుదల చేయడమే కాకుండా పరిపాలన అనుమతులను కూడా ఇచ్చిందన్నారు. నూతన బస్టాండు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, డబుల్‌బెడ్రూం, బాలికల జూనియర్ కళాశాల, సఖీ కేంద్రం నిర్మాణాలన్నీ తన హయాంలోనే నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు. గద్వాలలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుంటే చూసి ఓర్వలేని వారు అబద్దాలు చెబుతూ విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సత్యారెడ్డి, రమేష్‌నాయుడు, కౌన్సిలర్లు నాగిరెడ్డి, నరహరిగౌడ్ పాల్గొన్నారు.



చాగదోనలో డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గొల్లకురుమల ముందస్తు అరెస్టు



అలంపూర్: హక్కులు అడిగితే ముందస్తుగా అరెస్టులు చేశారని గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి జీకే ఈదన్న అన్నారు. అలంపూర్ పట్టణంలో గొల్ల మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి జీకే ఈదన్న, బుజ్జి, వెంకట్రాముడు, సుధాకర్‌లను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం గొల్ల కురుమలకు గొర్రెలను ఇస్తామని ఏడాది క్రితం డీడీలు తీసుకోని ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు.

బీటీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ



మల్దకల్: మండలంలోని నీలిపల్లి స్టేజీ నుంచి గ్రామం వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.60 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసే బీటీ రోడ్డు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, వెంకటన్న, విష్ణు, నరేందర్, నారాయణ, మధు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు

అయిజ: మండలంలోని ఉప్పలలో బీసీ ప్లాట్లకు సంబంధించిన రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తొలగించారు. తహసీల్దార్ షహిదా బేగం ఎస్‌ఐకి ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై గత నెల 25న జల్లాపురం నుంచి అలంపూర్ చౌరస్తాకు వస్తున్న ఆటోను వెనక నుంచి ట్రాలీ ఆటోతో ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సోమవారం ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా నరసింహారెడ్డి నగర్‌కు చెందిన కాంక్రీట్ మిల్లర్ పనులు చేస్తున్న మద్దయ్య అనే వ్యక్తి కర్నూల్ రైల్వే స్టేషన్ నుంచి జల్లాపురానికి బాడిగకు రావాలని అడగడంతో కూలీలను జల్లాపురానికి తరలించారు. కాంక్రీట్ మిల్లర్ కోసం ఆటో యజమాని శ్రీనివాసులు, మద్దయ్య, డ్రైవర్ షేక్ మహబూబ్‌బాషా, ఆటోలో అలంపూర్ చౌరస్తాకు ప్రయాణిస్తుండగా ఉండవెల్లి శివారులోని అమ్మనాన్న హోటల్ ఎదురుగా ఆటోను ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో ముగ్గురుకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ముగ్గురుని అశోక్ లైలాండ్ ట్రాలీలో డ్రైవర్ తరలించి అతను పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఆ ముగ్గురు సోమవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత పశు వైద్యశిబిరం



పశువుకు చికిత్స చేస్తున్న డాక్టర్ శంకరయ్య

గద్వాల వ్యవసాయం: మండలంలోని బీరెల్లిలో సోమవారం జిల్లా పశుగణన అభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి శంకరయ్య సిబ్బందితో కలిసి 30 గేదెలు, 15 ఆవులకు గర్భకోశ చికిత్స చేశారు. 75 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో వెటర్నరీ ట్రైనీ అసిస్టెంట్ రాముడు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ వంశీకృష్ణ, గోపాలమిత్రలు ప్రభాకర్, రామాంజనేయులు, జహంగీర్, పాడి రైతులు పాల్గొన్నారు.

కనులపండువగా శివాజీ రథయాత్ర



ఆత్మకూర్‌లో ఛత్రపతి శివాజీ రథయాత్ర చేస్తున్న హిందువులు

ఆత్మకూర్: ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగి 350 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా స్వామీజీలు, గురువులు, మాతాజీలు చేపట్టిన రథయాత్ర సోమవారం ఆత్మకూర్‌కు చేరుకుంది. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రముఖ స్వామీజీలు కల్కీభగవాన్‌బాబా, కొడిల్యాబాబా, హిమాలయబాబా హితబోధ చేశారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి కొందరు సనాతన ధర్మాన్ని విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం మన జీవన విధానం అని, దాన్ని విడిచిపెట్టొద్దని యువతకు సూచించారు. హిందూ ధర్మం యొక్క గొప్పదనాన్ని వివరించారు. అనంతరం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల గుండా శివాజీ మహారాజ్ రథయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అశ్విన్ కుమార్, నాగేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు, బాలకృష్ణ, శేషు, చందు, రఘు, ఆదర్శ్ ఉన్నారు.

అమరచింత: ఛత్రపతి శివాజీ మహారాజ్ మహా రథయాత్ర సోమవారం పట్టణానికి చేరుకోవడంతో హిందువులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులతో మునీశ్వరులు, సన్యాసులకు పూ లమాలలతో సత్కరించారు. పట్టణంలోని పుర వీధుల గుండా రథయాత్ర నిర్వహించారు. నాడు హిందూ ధర్మ పరిరక్షణ కోసం శివాజీ మహారాజ్ చేసిన పోరాటాలు మరువలేమన్నారు. స్వరాష్ట్ర ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని రథయాత్రలో పాల్గొన్న మునీశ్వరులు పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మతో పాటు హిందూధర్మ ప్రచార సమితి సభ్యులు, భవానీమాత భక్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యం



అభివాదం చేస్తున్న నాయకులు

అమరచింత: అమరచింతను రెవెన్యూ డివిజన్ చేయాలంటూ అఖిల పక్ష పార్టీలతో కలిసి ఉద్యమించాల్సిన అవసరం ఉందని, అమరచింతకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వానికి వివరించనున్నట్లు రెవెన్యూ డివిజన్ సాధన సమితి పేర్కొంది. సోమవారం పట్టణంలోని సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ నాయకులు అఖిల పక్షంగా ఏర్పడి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 11న పట్టణంలోని పద్మశాలి భవన్‌లో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జీఎస్ గోపి, సరాల నారాయణ, భాస్కర్, తౌఫిక్, పోసిరిగారి విష్ణు, ప్రభుదాస్, బాలస్వామి, కుతుబ్, రాజన్న, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కేటీదొడ్డి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం 'తిరగబడదాం-తరిమికొడదాం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గువ్వలదిన్నెలోని కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారికి ఓట్లు వేస్తారా? పేదలకు స్థలాలు, భూములు, పట్టాలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తారో ఆలోచించాల్సి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండ్ల లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీ గీత, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, లక్ష్మణ్, మహానందిరెడ్డి, శ్రీనివాస్‌గౌడు ఉన్నారు.



గువ్వలదిన్నెలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

బహుజనులు ఏకమై దేశాన్ని పాలించాలి

అలంపూర్: బహుజనులు ఏకమై దేశాన్ని పాలించాలనే ఆకాంక్షను నెరవేర్చుదామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. అలంపూర్ చౌరస్తాలో బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం 17వ వర్ధంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాన్షీరాం చిత్రపటానికి బీఎస్పీ నాయకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. దేశంలోనే పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీని అధికారంలోకి తెచ్చి నాలుగు సార్లు ముఖ్యమంత్రి ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాన్షీరాం వర్ధంతి కార్యక్రమానికి నియోజవర్గంలోని నాయకులు ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. బీఎస్పీ మహిళా నాయకురాలు నాగజ్యోతి, శోభగౌడ్, శారదమ్మ, మల్లీశ్వరి, రాంప్రసాద్ రెడ్డి, తిరుపాల్, మధుగౌడ్, రవి చందర్, నాగేశ్వర్ రెడ్డి, కనకం బాబు ఉన్నారు.



అలంపూర్ చౌరస్తాలో కాన్షీరాం వర్ధంతిలో బీఎస్పీ నాయకులు

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్



కేటీదొడ్డిలోని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

కేటీదొడ్డి: బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని ఎమ్మెల్యే సతీమణి సర్పంచు బండ్ల జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా సర్పంచ్ బండ్ల జ్యోతి, ఎంపీపీ మనోరమ హాజరయ్యారు. సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణం చేసి ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా బతికే విధంగా భారతదేశంలో హక్కున కల్పించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో మీ గ్రామానికి అండగా ఉంటానని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, రైతు సమన్వయసమితి అధ్యక్షుడు హనుమంతు, సర్పంచు పావని, ఎంపీటీసీ బీమయ్య, వాల్మీకి మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు, నాయకులు చక్రధర్, యుగంధర్, గోపి, వీరేష్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

రుణమాఫీ రాలేదని రైతుల ధర్నా

అలంపూర్ రూరల్: మండలంలోని లింగస్‌వాయిలో కెనరా బ్యాంక్‌లో రుణాలు పొందిన రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు రుణమాఫీ చేసినట్లు సంకేతాలు తప్ప, నగదు జమ కాలేదని సోమవారం రైతులు బ్యాంకు ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్కు వినతిపత్రం సమర్పించారు. రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి రూణమాఫీ వర్తింపజేయాలని కోరారు. రైతుల సమస్యను తీర్చేందుక అధికారుల దృష్టికి తీసుకెళ్తానని మేనేజర్ నాగేశ్వర రావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కెనరా బ్యాంకులో 1800 మంది రైతులు రుణాలు తీసుకోగా, కేవలం 50 మంది రైతులకు మాత్రం రుణమాఫీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుల, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



లింగస్‌వాయిలో కెనరా బ్యాంక్ ముందు ధర్నా చేస్తున్న రైతులు

ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

రాజోళి: ఈనెల 13న శాంతినగర్‌లో నిర్వహించే అలంపూర్ ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి అలంపూర్ నియోజకవర్గ కన్వీనర్ నాగేష్ తెలిపారు. మండలంలోని పెద్ద తాండ్రపాడులో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఏళ్ల తరబడి అలంపూర్‌లో అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా పోయిందని, పాలకులు మారినా, రాష్ట్రం ఏర్పడిన రైతులు, యువకులు కోరుకున్న అభివృద్ధి జరగలేదన్నారు. ఈ సభకు తెలంగాణ క్రాంతిదళ్ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డి పృథ్వీరాజ్, నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ గొంగ్ల రంజిత్ కుమార్ హాజరవుతారని తెలిపారు ఈ సభకు జిల్లా వ్యాప్తంగా భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీరేష్, కిషోర్, వెంకటేష్, గోపి పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో 50 మందికి పని కల్పించాలి

అలంపూర్ రూరల్: ప్రతి గ్రామంలో 50 మంది లేబర్‌కు పనులు కల్పించాలని ఎంపీడీఓ గోవిందరావు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గోవిందరావు మాట్లాడుతూ 2018-19 నుంచి 2022-23 వరకు ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పనులు పూర్తి చేసుకున్న వారికి ఉన్నతి పథకం కింద వ్యవసాయ అనుసంధానం ఉన్న వాటిపై ఉండవెల్లి మండలంలో 15 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో వర్మి కంపోస్ట్, న్యూట్రీషన్, మరియు వ్యవసాయ అనుబంధ రంగంలపై కృషి విజ్ఞాణ కేంద్రం మదనాపురం జిల్లా గ్రామీణభివృద్ధి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఈ నెల12 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ మహేష్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవిందరావు

పాఠశాలలు ఆధునిక దేవాలయాలు



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ధరూరు: పాఠశాలలు ఆధునిక దేవాలయాలని మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హరిజన్ చెర్రి ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ పద్మమ్మ, ఎంఈఓ సురేష్, ఎల్ఐసీ గ్రామాలయ అధికారులతో కలిసి టాయిలేట్స్‌ను, ప్రహరీని ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం రేవతి తన తండ్రి కీ.శే. పర్మాల నాగరాజు జ్ఞాపకార్థం రూ.2లక్షల వ్యయంతో నిర్మించిన కాంపౌండ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ దౌలన్న, మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సుజాత, ఎల్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రారంభం

గట్టు: మండలంలోని ఆరగిద్ద, మిట్టదొడ్డి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను సోమవారం జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్‌లు ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగం అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు యోగేశ్వరి, నర్సింహులు, వైస్ ఎంపీపీ సుమతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు అంగడి బస్వరాజు, శ్రీనాథ్, నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆరగిద్దలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్, ఎంపీపీలు